సాక్షి
అనకాపల్లి
శనివారం । 23 । నవంబర్ । 2024



జన్మ ధన్యం

కశింకోటలో పడమటమ్మ పుట్టుక మహోత్సవం ఘనంగా ముగిసింది. అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించారు. 8లో



శ్రీవారికి పట్టువస్త్రాలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు.



క్షీరాభిషేక సేవ


డాబాగార్డెన్స్: విశాఖలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా జరిగింది.

బడుగులపై ఫీజుల పిడుగు

- ప్రైవేట్ స్కూలు యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్న కూటమి ప్రభుత్వం
- విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు
- 2023లో జీవో 24 విడుదల చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ప్రస్తుత విద్యా సంవత్సరానికి 1812మంది విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లు
- హైకోర్టు తీర్పుతో జీవో రద్దు.. సీట్లు పొందిన వారి పరిస్థితి అగమ్యగోచరం
- వారి నుంచి ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ స్కూళ్లు

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం పేద విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఫీజుల భారం పిడుగులా పడడంతో బడుగులు అల్లాడిపోతున్నారు. వారి గోడు వినే నాథులే కరువయ్యారు. పేద విద్యార్థులకు ప్రైవేటు స్కూళ్లలో కూడా అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో 25 శాతం సీట్లు వారికి ఉచితంగా ఇవ్వమని రెండేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవో 24 విడుదల చేసింది. ఈ జీవో ప్రకారం సీట్లు పొందిన విద్యార్థుల పరిస్థితి ఇప్పుడు అడ కత్తెరలో పోక చెక్కలా తయారైంది.

సాక్షి, అనకాపల్లి: సామాన్యులకు విద్యను చేరువ చేయడం కూటమి ప్రభుత్వానికి నచ్చదు. అందుకే అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెనలాంటి పథకాలను నిలిపివేసింది. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు కనీసం వేరే పేర్లతో అయినా వాటిని అమలు చేయలేదు. ఇప్పుడు తాజాగా.. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఉచిత సీట్లు పొందిన వారు ఫీజులు చెల్లించాలన్న ఒత్తిడి పెరగడంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యాహక్కు చట్టం 2009–12 (1సీ) ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలన్న ఆశయంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవో నెం.24ను తీసుకొచ్చింది. అప్పటి నుంచి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో దీనిని అమలు చేస్తున్నారు. ఇది రెండో సంవత్సరం. 2024–25 విద్యా సంవత్సరానికిగాను జిల్లాలో 2,291 మంది పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు కేటాయించాల్సి ఉంది. ఈ విద్యా సంవత్సరం దరఖాస్తు చేసుకున్న వారిలో 1812 మంది అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందారు. వీరికి జిల్లావ్యాప్తంగా 312 కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో సీట్లు కేటాయించారు. ఇంతలో యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ గొల్లపూడి మోహన్‌రావు హైకోర్టులో పిల్ వేయడంతో ఆ జీవోను జూన్ 24న రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది.



స్పందించని కూటమి ప్రభుత్వం

హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అపీల్‌కు వెళితే పేదలకు అనుకూలంగా తీర్పు వచ్చేదేమో! కానీ మిన్నకుండిపోవడంతో వారికి ఇప్పుడు తంటా వచ్చింది. ఫీజులు చెల్లించమని ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు ఒత్తిడి చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. ఉచిత సీటు వచ్చిందని ప్రైవేటు విద్యా సంస్థల్లో జాయిన్ చేశామని, తమకు బాధ్యత లేదని కూటమి ప్రభుత్వం ముందే ప్రకటించి ఉంటే బాగుండేదని వారు వాపోతున్నారు. విద్యా సంవత్సరం మొదలై దాదాపు ఆరు నెలలు కావస్తోంది. మధ్యలో స్కూలును మార్చలేక, ఫీజులు కట్టలేక సతమతమవుతున్నారు. దిక్కుతోచని స్థితిలో అప్పులు చేసి4 ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గత ఏడాది సీట్లు పొందిన వారితో కలిపితే బాధిత విద్యార్థులు మొత్తం 4 వేలమందికి పైగా ఉంటారు. పేద విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వం కనికరించాలని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యావేత్తలు సూచిస్తున్నారు.

ఫీజులు వసూలు చేయకూడదు



హైకోర్టు జీవో 24ను రద్దు చేసింది. అయితే ఈ జీవో ప్రకా రం అడ్మిషన్ పొందిన విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయమని ఎటువంటి మార్గదర్శకాలు ఇవ్వలేదు. ప్రైవేట్ యాజమాన్యాలు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చే వరకు ఫీజులు వసూలు చేయకూడదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే అందుకు అనుగుణంగా వ్యవహరిస్తాం.

– అప్పారావునాయుడు, డీఈవో, అనకాపల్లి

ఇలాంటి జీవోలను పునరుద్ధరించాలి



పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అభ్యసించేలా ఉన్న జీవో 24ను పునరుద్ధరించాలి. ఈ ఏడాది ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులతో పాటు గతేడాది చేరిన విద్యార్థులకు ఉచితంగా విద్యను ప్రైవేట్ యాజమాన్యాలు అందించాలి. లేదంటే ఎస్ఎఫ్ఐ తరఫున ఉద్యమిస్తాం. హైకోర్టు తీర్పుపై ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లాలి.

– ఎం.రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

పేదోడికి దూరంగా చదువు



కూటమి ప్రభుత్వంలో పేదవాడికి చదువు దూరమవుతోంది. అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన లాంటి పథకాలను నిలిపివేయడంతో వారికి ఉన్నత చదువులు భారంగా మారాయి. కూటమి ప్రభుత్వం ఇదే ధోరణి కొనసాగిస్తే పేద విద్యార్థులు చదువులు మాని కూలి పనులు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

– సీహెచ్ శివాజీ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

పాఠశాల స్లాబ్ పెచ్చులూడి విద్యార్థి తలకు గాయం



తలకు కట్టుతో విద్యార్థి లక్ష్మణ్



పెచ్చులూడిన వరండా పైభాగం

గొలుగొండ: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థికి స్కూల్ వరండా స్లాబ్ పెచ్చులూడి గాయమైంది. స్లాబ్ రాయి విద్యార్థి నుదుటికి తగలడంతో గాయపడ్డాడు. రక్తం రావడాన్ని గుర్తించిన ఉపాధ్యాయుడు దగ్గరే ఉన్న గొలుగొండ పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం చేయించారు. మండలంలోని నర్సింగబిల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం 11 గంటల సమయంలో ఉపాధ్యాయుడు గణేష్ వరండాలో పిల్ల లకు బోధిస్తున్నారు. ఆ సమయంలో స్లాబ్‌కు పెచ్చులూడాయి. అందులో ఓ రాయి 5వ తరగతి విద్యార్థి రాయపురెడ్డి లక్ష్మణ్ నుదుటిని గట్టిగా తాకింది. స్లాబ్ పెచ్చు నేరుగా విద్యార్థి తలపై పడితే పెద్ద ప్రమాదమే జరిగేది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఈవో–2 ఏవీఎస్ఎస్ మూర్తి పాఠశాలకు వెళ్లి విద్యార్థిని పరామర్శించారు. వరండాలో తరగతులు నిర్వహించవద్దని ఉపాధ్యాయులకు చెప్పారు. పాఠశాల మరమ్మతుల కోసం నిధుల మంజూరు కోరుతూ ఎంఈవో సత్యనారాయణ పలుమార్లు జిల్లా విద్యాశాఖకు నివేదించారు. అధికారులు వెంటనే స్పందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని తల్లిదండ్రులు అంటున్నారు.

పథకాలు అమలైతేనే జిల్లా ప్రగతి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు మొదటి ప్రాధాన్యం
- ఎస్సీ, ఎస్టీలకు నూరు శాతం సబ్సిడీతో సోలార్ పథకం
- ఉత్తమ సర్పంచ్‌లకు గణతంత్ర దినోత్సవంలో గౌరవం
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడంలో అధికారులు మరింతగా దృష్టి సారించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డ్వామా, పంచాయతీరాజ్, జిల్లా పంచాయతీ, రోడ్లు భవనాలు, గ్రామీణాభివృద్ధి, మెప్మా, విద్యుత్ శాఖ, పశుసంవర్ధకశాఖ, హౌసింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ఆయా శాఖల ద్వారా అమలవుతున్న పథకాల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేసినప్పుడు మాత్రమే జిల్లా అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, క్లాప్‌మిత్రలకు ప్రతి నెల జీతాలు సక్రమంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 10 అంశాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రమాణాల మేరకు అమలు చేసిన ఉత్తమ పంచాయతీల సర్పంచ్‌లను గణతంత్ర దినోత్సవ వేడులకు అతిథులుగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. లాక్‌పతి దీదీ యోజన పథకం ద్వారా ప్రతి కుటుంబం నెలకు రూ. 10 వేలు ఆదాయం పొందేలా ప్రోత్సాహం అందించాలన్నారు. ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునేలా గృహస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు నూరు శాతం సబ్సిడీతో సోలార్ పథకం అందించనున్న నేపథ్యంలో వారితో ఈ పథకానికి దరఖాస్తు చేయించాలన్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న అత్యవసర వైద్య సేవలు పొందేందుకు 1962 నంబర్‌కు ఫోన్ చేయాల్సి ఉంటుందని రైతులకు తెలపాలన్నారు.

డిసెంబర్‌లో పాఠశాలల కమిటీ సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, షెడ్యూల్ ప్రకారం ఆహ్వాన పత్రికను విద్యార్థులే రూపొందించి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని మండల స్థాయిలో కూడా నిర్వహించాలన్నారు. అధికారులెవరూ సోమవారం సెలవు పెట్టకూడదన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి జి.రామారావు, పశుసంవర్ధక శాఖాధికారి బి. రామమోహనరావు, డీఆర్‌డీఏ పీడీ కె. శచీదేవి, హౌసింగ్ పీడీ వై. శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వి.నాయుడు, ఇతర జిల్లా అధికారులు, మండల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌డబ్ల్యూవో శ్యామల సరెండర్

నర్సీపట్నం: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న అభియోగాలు రుజువు కావడంతో ఏఎస్‌డబ్ల్యూవో ఎం.శ్యామలను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. నాతవరం బాలికల వసతిగృహం విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ప్రధాన ఆరోపణ. వసతిగృహంలో సౌకర్యాలు లేక కొంతమంది విద్యార్థినిలు ఇళ్లకు వెళ్లిపోతున్నారు. అధికారుల విచారణలో ఏఎస్‌డబ్ల్యూవో పర్యవేక్షణ కొరవడిందని తేలడంతో ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూవోగా బీసీ హాస్టల్స్‌కు చెందిన ఏబీసీడబ్ల్యూవో గోపీనాథరావును జిల్లా అధికారులు నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

బాల్య వివాహానికి బ్రేక్

పెళ్లి పెద్దలను ఒప్పించిన అధికారులు



గోవాడలో మైనర్ బాలిక పెళ్లి నిలిపివేయాలని ఇరు కుటుంబాలతో మాట్లాడుతున్న అధికారులు

చోడవరం: మైనార్టీ తీరని మైనర్ బాలికకు పెద్దలు చేస్తున్న వివాహాన్ని అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. తెల్లారితే వివాహం అనగా అధికారులు వచ్చి పెద్దలకు నచ్చచెప్పి పెళ్లిని వాయిదా వేయించారు. గోవాడ గ్రామానికి చెందిన అబ్బాయికి ముద్దుర్తి గ్రామానికి చెందిన మైనర్ బాలిక (17)కు ఈనెల 23వ తేదీన వివాహం చేసేందుకు పెద్దలు నిశ్చయించారు. అందుకు తగ్గ ఏర్పాట్లు కూడా చేశారు. ఇంతలో అధికారులకు సమాచారం తెలియడంతో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఉషారాణి ఆధ్వర్యంలో చోడవరం పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు, చైల్డ్ వెల్ఫేర్ ప్రతినిధుల బృందం గోవాడలో పెళ్లి మండపానికి వచ్చింది. బాలిక మేజర్ కానందున వివాహం నిలిపివేయాలని ఆదేశించారు. ఇరు కుటుంబాల పెద్దలను, కుటుంబసభ్యులను పిలిచి బాలికకు మైనార్టీ తీరే వరకూ వివాహం చేయవద్దని నచ్చచెప్పారు. ఇరు కుటుంబాలు అంగీకరించడంతో అధికారులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ

సింధియా (విశాఖ): సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ షిప్ బిల్డింగ్(సెమ్స్), వైజాగ్ జనరల్ కార్గో బెర్త్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా సీఎన్‌సీ మెషీన్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నాయి. 18 నుంచి 27 ఏళ్ల వయసు ఉండి.. ఇంటర్, ఐటీఐ, డిప్లమో కోర్సుల్లో మెకానికల్, ఎలక్ట్రికల్ ఉత్తీర్ణులైన యువతీయువకులు శిక్షణకు అర్హులు. విశాఖపట్నం పోర్టు పరిసర ప్రాంత నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు సింధియా జంక్షన్‌లోని సెమ్స్ కేంద్రంలో గానీ, 86884 11100, 0891–2704010 నంబర్లకు గానీ సంప్రదించవచ్చు. ఈ నెల 30వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సెమ్స్ వర్గాలు తెలిపాయి.

ఓటర్ల జాబితాలో పేర్ల గల్లంతుపై ఫిర్యాదు

- తప్పుల తడకగా తాండవ ప్రాజెక్టు నీటి సంఘం జాబితా
- అధికారుల నిర్లక్ష్యంపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు
- బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు వెంకట రమణారావు



నాతవరం: తాండవ రిజర్వాయర్ నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి తయారు చేసిన ఓటర్ల జాబితాలో పేర్ల గల్లంతుపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు, చెరువుల పరిరక్షణ కమిటీ జిల్లా కార్యదర్శి లాలం వెంకట రమణారావు అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోనే మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో భూములున్న అనేక మంది రైతుల పేర్లు ఓటర్ల జాబితాలో లేవన్నారు. గతంలో తాను తాండవ ప్రాజెక్టు పరిధిలో 21వ సెగ్మెంట్ నీటి సంఘం డైరెక్టర్‌గా, అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు ఎన్నికయ్యానన్నారు. ఇటీవల అధికారులు ప్రకటించిన ఓటర్ల జాబితాలో తన పేరు లేదన్నారు. తనలాగే నాతవరం మండలంలో అనేక మంది రైతులకు ఓటు హక్కు లేకుండా తప్పుల తడకగా ఓటరు జాబితా తయారు చేశారన్నారు. ఎన్నికలు జరిగే తాండవ రిజర్వాయర్, ఎర్రిగెడ్డ ఆనకట్టు పరిధిలో అనేక మంది రైతులకు ఓట్లు లేవన్నారు. గతంలో పలుమార్లు నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేసిన వారు, ఓటు వేసిన రైతుల పేర్లు కూడా ఓటరు జాబితాలో లేకపోవడం దారుణమన్నారు. నాతవరం, ములగపూడి, పెదగొలుగొండపేట, వెదురుపల్లి, గునుపూడి, గన్నవరం, శృంగవరం, ఎం.బి.పట్నం గ్రామాల్లో సైతం రైతుల ఓట్లు గల్లంతు అయ్యాయన్నారు. దీనిపై అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నారన్నారు. ఈనెల 23న జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడటంతో భూములున్న రైతులందరికీ ఓటు హక్కు కల్పించాలని రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేశానన్నారు.

అప్పన్నను దర్శించిన యువ క్రికెటర్లు



అప్పన్న ఆలయంలో క్రికెటర్లు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం పలువురు భారత దేశవాళీ క్రికెటర్లు దర్శించుకున్నారు. శుభమ్ దూబే, జితేష్ శర్మ, దీపేష్ పర్వాని, పార్థ్ రేఖడే, యష్ ఠోరట్, అక్షయ్ వాడ్కర్, మందర్ మహలే స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట అంతరాలయంలో అర్చకులు అష్టోత్తరపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి వారి ప్రసాదం, శేష వస్త్రాలను ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు. ప్రోటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్, ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విజ్ఞాన వీచిక

విహార యువగీతిక

- తమ గురించి తాము తెలుసుకునే రైలు ప్రయాణం
- విశాఖ చేరుకున్న జాగృతి యాత్ర
- 15 రోజులపాటు 8 వేల కి.మీ. సాగనున్న స్పెషల్ ట్రైన్



సాక్షి, విశాఖపట్నం/పెందుర్తి/తగరపువలస : సాధారణంగా చూసేందుకు అది రైలే. కానీ **మరింత పరికించి చూస్తే అదో కదిలే విశ్వవిద్యాలయం. ప్రతి బోగీ** ఒక తరగతి గది. ఆలోచనలకు పదును**పెట్టాలన్నా..** వాటి నుంచి అద్భుతాలను ఆవిష్కరిం**చాలనే కాంక్ష** యువతరంలో బలంగా నాటుకోవాల**న్నా..** విజ్ఞానాన్ని, సృజనాత్మకతను పెంపొం**దించాలన్నా..**ఆ రైలులో కూర్చుంటే చాలు. **జీవితానికి సరి**పడా జ్ఞానాన్ని ఆ ప్రయాణంలోనే స**ముపార్జించుకో**వచ్చు. ఆ ప్రయాణం పేరే జాగృతి **యాత్ర. కేవలం** నడిచేది 15 రోజులే అయినా జీవితాం**తం తప్పటడు**గులు వెయ్యకుండా నడిచేంత ధైర్యాన్ని **నూరిపోస్తుం**దీ యాత్ర. తమను తాము తెలుసుకు**నేందుకు ముం**బైలో బయలుదేరిన జాగృతి యాత్ర **రైలు శుక్రవారం** విశాఖ చేరుకుంది.

జీవితంలో స్థిరపడేంత అనుభవం

ఈ రైలు ఎక్కిన వారంతా 30 ఏళ్లలోపు వాళ్లే. తమ ప్రయాణంలో జీవితంలో స్థిరపడేంత అనుభవాన్ని సంపాదించుకుంటారు. ముఖ్యంగా ఎడ్యుప్రెన్యూర్ షిప్, అగ్రి, సోషల్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్స్‌పై అవగాహన ప్రతి ఒక్కరికీ కలుగుతుంది. ఈ ఏడాది భారత్‌తో పాటు 23 వివిధ దేశాలకు చెందిన 525 మంది యాత్రికులను వడపోత ద్వారా ఎంపిక చేశారు. ఈనెల 16న ముంబైలో మొదలైన రైలు 12 నగరాల్లో తిరిగి డిసెంబర్ 1న ముంబైలో ముగియనుంది. శుక్రవారం పెందుర్తి రైల్వే స్టేషన్‌కు జాగృతి రైలు చేరుకుంది. యువతీయువకులు పెందుర్తి నుంచి నేరుగా గంభీరంలోని అక్షయపాత్రను సందర్శించారు. అక్కడి నుంచి గీతం యూనివర్సిటీకి వెళ్లి విద్యార్థులు, ప్రొఫెసర్లతో సంభాషించారు.

ప్రతి కోచ్‌లోనూ నిపుణులతో చర్చలు

ఈ యాత్ర జాగృతి సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో 17 ఏళ్లుగా కొనసాగుతోంది. వ్యవస్థాపకుడిగా శశాంక్ మణి వ్యవహరిస్తున్నారు. ఎంటర్‌ప్రైజెస్ ద్వారా భారతదేశాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో యాత్రను నిర్వహిస్తున్నారు. మొత్తం 150 మంది నిపుణులు.. ట్రైన్‌లో ప్రయాణించే వారి జీవితాల్లో మార్పులు తీసుకొచ్చేలా జీవిత పాఠాలు బోధిస్తారు. తరగతిగదిలో నేర్చుకున్న దానికీ, బయట పరిశ్రమల అవసరాలకు మధ్య పెరుగుతున్న అంతరం తగ్గించేలా.. ఎప్పటికప్పుడు కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా.. రైలు దిగేలోపు జీవితంలో ఏదో ఒకటి సాధిస్తామన్న విశ్వాసాన్ని కల్పిస్తారు. అంతేకాకుండా ముంబై, బెంగళూరు, ఢిల్లీ, చెన్నై మొదలైన మెట్రో నగరాల్లో దిగ్గజాలతో ఇంటరాక్షన్ సెషన్స్ కూడా నిర్వహిస్తారు. ఇప్పటికే ఈ 17 ఏళ్ల రైలు ప్రయాణంలో 28 శాతం మంది పారిశ్రామికవేత్తలుగానూ, 62 శాతం మంది ఉద్యోగాల్లోనూ మిగిలిన వారు సామాజిక సేవలో స్థిరపడ్డారు.

మళ్లీ వస్తా..



బీటెక్ ఎలక్ట్రానిక్స్ పూర్తి చేశాను. జాగృతియాత్ర బిజినెస్ టూర్‌లా సాగుతోంది. ఎక్కడైనా అందరికీ సమాన అవకాశాలు ఉంటాయి. వాటిని ఎలా వినియోగించుకోవాలో ఇక్కడ తెలియజేస్తున్నారు. సామాజికసేవలో భాగంగా గ్రామాలను అభివృద్ధి చేయడానికి ఉపయోగపడుతుంది.

– దీప్తి, హైదరాబాద్

టూరిజం వైపు అడుగులు



ప్రస్తుతం టూరిజం ట్రావెల్ రంగంలో ఉన్నా. జాగృతి యాత్ర ద్వారా టూరిజం రంగంలో ఉన్న లోటుపాట్లు, ఇతరత్రా అంశాలను పరిశీలిస్తున్నా..అరకు టూరిజం బాగుంది. దీనిపై ప్యాకేజీలు అందిస్తున్నాం. తాజాగా ఎక్స్‌పీరియన్స్‌ల్ ట్రావెల్ పేరిట ప్యాకేజీలు అందించాలన్నది మా ఆలోచన. ఈ ప్యాకేజీ ద్వారా గిరిజన ప్రజలతో మమేకం అయ్యి వారి జీవన విదానాలు తెలుసుకునే విధంగా ప్రణాళిక రూపకల్పన చేస్తున్నాం.

– బొడ్డేపల్లి అవినాష్, సుజాతనగర్, పెందుర్తి

గోల్ సాధిస్తా..



బీటెక్ పూర్తి చేసి ఎలమంచిలి, అచ్యుతాపురం, ఒంగోలు, తిరుపతిలలో స్టార్టప్ వ్యాపారం చేస్తున్నాను. ఈ యాత్ర ద్వారా నిధులు సమీకరించి హైదరాబాద్, విజయవాడలకు ఈ వ్యాపారాన్ని విస్తరిస్తా. కచ్చితంగా గోల్ సాధనకు ఈ యాత్ర ఉపయోగపడుతుంది.

– కట్టా ప్రణీత్, యలమంచిలి

ఉపాధి అవకాశాలు



పారిశ్రామికవేత్తలను తయారు చేసి గ్రామీణులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే జాగృతి యాత్ర లక్ష్యం. ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నప్పటికీ సొంతంగా స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసి లాభదాయక ఉత్పత్తులు ఎగుమతి చేసేలా సిద్ధం చేస్తాం. అందులో భాగంగా గంభీరంలోని అక్షయపాత్ర వంటశాలను సందర్శించాం.

– శేషగిరి, ట్రస్ట్ సభ్యుడు, జాగృతి సేవాసంస్థ, ఉత్తరప్రదేశ్

అక్షయపాత్ర సందర్శన

తగరపువలస: అక్షయపాత్ర ఫౌండేషన్ అపరిమిత ఆహారంతో అపారమైన విద్యను అందిస్తుందని అక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యగౌర చంద్ర దాస తెలిపారు. శుక్రవారం సాయంత్రం జాగృతి సేవాసంస్థ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందిన పారిశ్రామిక రంగంలో ఆసక్తి కలిగిన 525 మంది యువతీయువకులు ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని అక్షయపాత్ర వంటశాలను అధ్యయనం చేయడానికి వచ్చారు. వీరిని ఉద్దేశించి సత్యగౌర చంద్రదాస ప్రసంగించారు. తమ ఫౌండేషన్ ద్వారా దేశవ్యాప్తంగా 23 లక్షల మంది విద్యార్థులకు 75 వంట శాలల ద్వారా ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంతో 24 ఏళ్లుగా నిత్యం మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నామన్నారు. ఫౌండేషన్ విశాఖ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస ఆధ్వర్యంలో జాగృతి యాత్ర వరుసగా 9వసారి అక్షయపాత్ర ఫౌండేషన్‌ను సందర్శించినట్టు గుర్తు చేశారు.



అక్షయపాత్రలో యువతీ యువకులు

చూసిన కనులదే భాగ్యం

- అంగరంగ వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం
- చూసితరించిన భక్తజనం
- గోవింద నామస్మరణతో మార్మోగిన క్షేత్రం


స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


స్వామి ఊరేగింపులో పల్లకీని మోస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు,స్థానిక పెద్దలు

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి దివ్యలీలా కల్యాణం... చూసిన కనులదే భాగ్యం అన్న చందంగా సాగింది. వందల సంఖ్యలో దంపతులు స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అంతకు ముందు స్వామి వారి ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో ఊరేగించారు. సుమారు 10 గ్రామాల నుంచి వచ్చిన కోలాట, తప్పెటగుళ్ల బృందాల ఆటపాటలు, సన్నాయిమేళాల మధ్య ఊరేగింపు కోలాహలంగా సాగింది. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజక వర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు, స్థానిక పెద్దలు బొలిశెట్టి శ్రీనివాసరావు, గోవిందరావు, కొణతాల శ్రీనివాసరావు, లక్కోజుదిమూర్తి, సర్పంచ్ భూపతి అప్పారావు, ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ శారదాకుమారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దేపల్లి బొజ్జన్న తదితరులు స్వామి పల్లకీని మోసారు.అనంతరం సాయంత్రం కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు చక్రవర్తి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.


మహిళలు,చిన్నారుల కోలాటం


తోడపెద్దు సంబరం

నిజరూప దర్శనం.. జన్మ ధన్యం

ఘనంగా ముగిసిన పడమటమ్మ పుట్టుక మహోత్సవం


పురుగు రూపంలో దర్శనమిచ్చిన పడమటమ్మ వారి ప్రతిరూపం


తోడపెద్ద సేవ చేస్తున్న భక్తులు

కశింకోట: మండల కేంద్రం కశింకోటలో నిర్వహించిన పడమటమ్మ పుట్టుక మహోత్సవం శుక్రవారం మధ్యాహ్నం ఘనంగా ముగిసింది. మండలంలోని విసన్నపేట వద్ద వెలసి ఉన్న అమ్మ వారి లోవ నుంచి పల్లకిలో కశింకోట తీసుకు వచ్చిన పురుగు రూపంలో ఉన్న నిజరూపాన్ని గ్రామంలోని ప్రధాన వీధులో ఊరేగించారు. సేవ, భజనలతో స్వాగతం పలికారు. భారీగా బాణ సంచా కాల్చారు. నిజరూపంలో అమ్మను దర్శంచుకున్న భక్తులు తమ జన్మ ధన్యమైందని ఉప్పొంగిపోయారు. కశింకోట శివారు నుంచి కస్పావీధిలో వెలసి ఉన్న ఆలయం వరకు ఉత్సవం సాగింది. అనంతరం అక్కడి ఆలయంలో నిలిపి అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. నెల రోజులపాటు పూజలు చేసిన అనంతరం పండగ నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవం సందర్భంగా గురువారం అర్ధరాత్రి తర్వాత కాల్చిన బాణ సంచా కళ్లు మిరుమిట్లుగొలిపేలా వెలుగులు విరజిమ్మింది. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున బాణ సంచా కాల్చారు. ప్రజలు ఆసక్తిగా తిలకించి ఆనంద పరవశులయ్యారు.శివపాల వధ, కురుక్షేత్రం, ద్రౌపది వస్త్రాపహరణ వంటి ఘట్టాలకు సంబంధించి పౌరాణిక సెట్టింగ్ స్టేజీలు అబ్బురపరిచాయి. ట్రాక్టర్‌పై చిన్నారులతో సహా పలువురు వివిధ వేషాలతో ఆకట్టుకున్నారు. ఉత్సవం సందర్భంగా ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవానికి ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆట వస్తువులు, అలంకరణ వస్తువుల అమ్మకాలు జోరుగా సాగాయి. ఉత్సవం సందర్భంగా సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


విద్యుద్దీపాలంకరణతో కటౌట్


ఉత్సవంలో వస్తువులను కొనుగోలు చేస్తున్న ప్రజలు


ఉత్సవానికి హాజరైన భక్త జన సందోహం

వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో చోరీ


దొంగలు మామిడి తోటలో వదిలేసిన ఖాళీ హుండీలు

దేవరాపల్లి: మండలంలో ముషిడిపల్లికి చెందిన వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో గురువారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. ఆలయ గేటును తొలగించి, గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఆలయంలోకి చొరబడ్డారు. రెండు హుండీలను సమీపంలో ఉన్న మామిడి తోటలోకి తీసుకెళ్లి, తెరిచి, అందులో నగదుతో పాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలను అపహరించారు. ఆలయంలో చోరీ జరిగిన విషయాన్ని దేవరాపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వాసవీక్లబ్ అధ్యక్షుడు కొప్పాక అప్పారావు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

ఎస్.రాయవరం: జాతీయ రహదారిపై అక్రమంగా కంటైనర్‌లో తరలిస్తున్న 111 పశులను పట్టుకుని గోశాలకు తరలించినట్టు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. ఒడిశా నుంచి విజయవాడపై తరలిస్తున్న వీటిని అడ్డురోడ్డు సమీపంలోపట్టుకున్నట్టు ఆయన చెప్పారు. 44 ఎద్దులు, 67 ఆవులు ఉన్నట్టు చెప్పారు. వీటిలో 19 ఆవులు, ఎద్దులు మృతి చెంది ఉన్నాయన్నారు. పట్టుబడిన ఆవులను వైద్యులు తనిఖీ చేశాక గోశాలకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


డిపో వద్ద ధర్నా చేస్తున్న ఫెడరేషన్ నాయకులు

అనకాపల్లి: ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ ఎదుట ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) డిపో అధ్యక్షుడు బి.అప్పారావు, కార్యదర్శి పరమేశ్వరరావు మాట్లాడుతూ పనిష్మెంట్లు ఒకే విధంగా ఉండాలని కోరారు. బస్సుల్లో టికెట్ తీసుకునే బాధ్యత ప్రయాణికులపైనే పెట్టాలని, సర్క్యులర్ నంబర్ 70,71 లలో మార్పు చేయాలని, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఏడీసీలు,సూపర్‌వైజర్లు, ఆఫీస్ సిబ్బందిపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కొత్తబస్సు లు కొనుగోలు చేయాలని, పెండింగ్ మెడికల్ బిల్లులు విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేసి, ఉద్యోగులపై పనిభారాన్ని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు పలకా సత్యనారాయణ, త్రిమూర్తులు, ఎస్.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌లోడు వాహనదారుల లైసెన్స్‌లు రద్దు

డీఎస్పీ శ్రావణి హెచ్చరిక


భారీలోడుతో వెళుతున్న వాహనాల డ్రైవర్ల లైసెన్స్‌లు, రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి: మండల పరిధిలోగల క్వారీల నుంచి లారీల్లో పరిమితికి మించి లోడు వేసుకుని రవాణా చేసినట్టయితే డ్రైవర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని డీఎస్పీ ఎం.శ్రావణి హెచ్చరించారు. మండలంలో కొత్తూరు బ్రిడ్జి వద్ద శుక్రవారం తనిఖీలు నిర్వహించి అధికలోడుతో వెళుతున్న లారీలను పట్టుకున్నారు. వాటిని ట్రాఫిక్ పోలీసులకు అప్పగించి కేసులు నమోదు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక లోడు వాహనాల వల్ల తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, లారీల నుంచి క్వారీ మెటీరియల్ పడి ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆమె తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు కారణమైన వాహన చోదకుల లైసెన్స్‌లు నిలుపుదల చేస్తామని, వాహనాల పర్మిట్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కలాసీలపై దాడి చేసిన ఇద్దరు విద్యార్థులు, ఆటో డ్రైవర్ అరెస్టు

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి మండలం ఎస్‌ఈజెడ్ ప్రాంతంలో ఈనెల 20వ తేదీన కలాసీలపై దాడికి పాల్పడిన కేసుకు సంబంధించి అచ్యుతాపురం మండలం, పూడిమడక గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్, ఇద్దరు విద్యార్థులను శుక్రవారం అరెస్టు చేసినట్లు రాంబిల్లి పోలీసులు తెలిపారు. పారిశ్రామిక ప్రాంతమైన రాంబిల్లి ఎస్‌ఈజెడ్‌లో పని చేస్తున్న కలాసీలపై పూడిమడక గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మైలపల్లి జగదీష్ (22), ఐటీఐ, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గనగళ్ల భాను (20), పుక్కల నవీన్ దాడి చేశారు. దీంతో పలువురు కలాసీలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు రాంబిల్లి సీఐ సీహెచ్ నర్సింగరావు కేసు నమోదు చేసి నిందితులను యలమంచిలి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని రాంబిల్లి సీఐ సీహెచ్ నర్సింగరావు హెచ్చరించారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్‌కు గాయాలు


ఏలేరు కాలువ వద్ద ప్రమాదానికి గురైన లారీలు

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక ఏలేరు కాలువ వద్ద శుక్రవారం గాజువాక నుంచి అనకాపల్లి వెళ్తున్న రెండు బొగ్గు లారీలు ఢీకొన్నాయి. ఏలేరు కాలువ బ్రిడ్జి సమీపంలో రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో ముందు వెళ్తున్న బొగ్గు లారీ బ్రేక్ వేయడంతో అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న మరో బొగ్గు లారీ దానిని ఢీకొనడంతో వెనుక లారీ డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకున్నాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ అనకాపల్లి అధికారి నాగేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. క్యాబిన్‌లో చిక్కుకున్న లారీ డ్రైవర్‌ను బయటికి తీసి స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో సుమారు రూ. 2 లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారి చెప్పారు. ఈ విషయంపై పట్టణ పోలీస్‌లకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

రూ.27 కోట్లతో 742 పనులు

- డిసెంబర్ చివరినాటికి పూర్తి చేయాలి
- జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి


దేవరాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అధికార్లతో చర్చిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

కె.కోటపాడు/దేవరాపల్లి/చీడికాడ: ఉమ్మడి విశాఖ జిల్లాలో 2024–25 కాలానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.27 కోట్లతో 742 పనులను చేపడుతున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి చెప్పారు. కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి, అధికారులతో మాట్లాడారు. కె.కోటపాడు మండల పరిషత్ కార్యాలయానికి మొదటిసారిగా వచ్చిన సీఈవోకు స్థానిక ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సీఈవో నారాయణమూర్తి మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. జెడ్పీ నిధులతో చేపడుతున్న పనులను ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి పూర్తి చేయాలని సూచించారు. ఈ నిధులతో ప్రధానంగా శ్మశానవాటికలు, డ్రెయినేజీ, మంచినీటి పథకాల నిర్వహణతోపాటు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. కె.కోటపాడు మండలంలో పల్లె పండగ కార్యక్రమంలో 51 పనులకు రూ.6 కోట్ల 29 లక్షల నిధులను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పనుల్లో ఇప్పటికే 24 పనులు పూర్తి కాగా 27 పనులు ప్రస్తుతం సాగుతున్నాయన్నారు. గ్రామాల్లో ప్రతి శనివారం ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీడీవో ఎ.ఎ.సాంబశివరావు, సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు, మండల ఇంజినీరింగ్ అధికారి సుమతి, ఈవోఆర్డీ రమణి, కొండలరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు. దేవరాపల్లిలో సీఈవో మాట్లాడుతూ.. మాడుగుల నియోజకవర్గంలో 195 పనుల కోసం రూ 27.44 కోట్లు వ్యయం చేస్తున్నామన్నారు. దేవరాపల్లి మండలంలో జల్‌జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయన్నారు. ఎంపీడీవో సువర్ణరాజు తదితర అధికారులు పాల్గొన్నారు. చీడికాడలో ఎంపీడీవో హేమసుందర్, తదితర అధికారులను పనుల పురోగతి గురించి ఆరా తీశారు.

పరస్పర సహకారంతో పోలీస్ విధులు

- అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా
- పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం


స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న పోలీసుల నుంచి వందనం స్వీకరిస్తున్న ఎస్పీ


పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభిస్తున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

ఆరిలోవ(విశాఖ తూర్పు): పోలీస్ వృత్తిలో ఉన్న వారికి పరస్పర సహకారం అవసరమని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. విశాఖపట్నం విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో అనకాపల్లి జిల్లా పోలీసులకు వార్షిక స్పోర్ట్స్ మీట్-2024 నిర్వహించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ మీట్‌ను శుక్రవారం ఎస్పీ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. శాంతి కపోతాలు, బెలూన్లు గాలిలోకి ఎగురవేశారు. స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న పోలీసులు క్రీడా పతాకాలతో ఆయనకు గౌరవ వందనం చేశారు. అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నం సబ్ డివిజన్ల ఏఆర్ పోలీస్ అధికారులు, సిబ్బంది చేపట్టిన మార్చ్‌పాస్ట్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్, తదితర క్రీడల్లో వ్యక్తిగతంగా, జట్టుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసులందరూ నియమాలు తప్పకుండా పాటించి, క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని కోరారు. పోలీసులు 365 రోజులు మానసిక ఒత్తిడితోనే విధులు నిర్వహించాల్సి ఉంటుందని, దానిని అధిగమించాలని సూచించారు. క్రీడలు పోలీసుల్లో క్రీడా స్ఫూర్తి, మానసిక స్థైర్యం, మానసిక ఉల్లాసం, ఆహ్లాదం కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రీవాణి, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కశింకోట: మండల కేంద్రం కశింకోటలో పూర్వపు ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయ భవనం వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు సీఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. ఆర్‌ఈసీఎస్ కార్యాలయం వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొన్నట్టు చెప్పారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించామన్నారు. వివరాలు తెలిసిన వారు తమ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఎనిమిది మంది జూదగాళ్ల అరెస్ట్

రూ.50,960, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం


అనకాపల్లి: స్థానిక ఏఎంసీ కాలనీలో బహిరంగ ప్రదేశంలో జూదం ఆడుతున్న ఎనిమిదిమందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 50,960లు, ఎనిమిది సెల్‌ఫోన్లు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ కె.సంతోష్‌కుమార్ శుక్రవారం చెప్పారు. గురువారం అర్ధరాత్రి అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు తమ బృందంతో ఏఎంసీ కాలనీలో దాడి చేసి జనపరెడ్డి నాగేశ్వరావు, మాడేటి రాంబాబు, కందుల నాగరాజు, కొమ్మనమంచి వెంకటరామ్మూర్తి, మంత సురేష్, మామిడి నూకరాజు, చొప్పర్ల నాగమహేష్, నాగులకొండ నానాజీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

శారదా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


గుర్తు తెలియని మృతదేహం

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో పినకోట రోడ్డుకు అనుకుని ప్రవహిస్తున్న శారదా నదిలో గుర్తు తెలియని వృద్ధుని మృత దేహం శుక్రవారం లభ్యమైంది. నదిలో మృతదేహం తేలియాడుతుండడాన్ని గమనించిన కొంత మంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వివరాలు లభ్యం కాలేదని వారు తెలిపారు.

అయ్యప్ప భక్తుల కోసం శ్రీకాకుళం-కొల్లాం మధ్య రైలు



తాటిచెట్లపాలెం: అయ్యప్ప భక్తుల కోసం శ్రీకాకుళం రోడ్-కొల్లాం- శ్రీకాకుళం రోడ్ మధ్య వాల్తేర్ డివిజన్ స్పెషల్ రైళ్లు నడుపుతోంది. ప్రస్తుతం నడుస్తున్న విశాఖ-కొల్లాం రైలును ఫిబ్రవరి వరకు పొడిగించింది.

- శ్రీకాకుళం రోడ్-కొల్లాం(08553) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ ఆదివారం ఉదయం 6 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయల్దేరి 8.47 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.52 గంటలకు బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జనవరి 26 వరకు నడుస్తుంది. కొల్లాం–శ్రీకాకుళం రోడ్(08554) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమవారం సాయంత్రం 4.30 గంటలకు కొల్లాంలో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 10.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి రాత్రి 10.40 గంటలకు బయల్దేరి శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది.
- విశాఖ-కొల్లాం(08539) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం ఉదయం 8.20 గంటలకు విశాఖలో బయల్దేరి గురువారం మధ్యాహ్నం 12.55గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు ఫిబ్రవరి 26వ తేదీ వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో ప్రతీ గురువారం కొల్లాంలో రాత్రి 7.35 గంటలకు బయల్దేరి శుక్రవారం రాత్రి 11.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

'మా భూములను సర్వే చేయడానికి వీల్లేదు'


విలేకర్లతో మాట్లాడుతున్న రైతు నాయకులు

నక్కపల్లి: బలవంతంగా తమ భూములను సర్వే చేయవద్దని, తక్షణమే నిలిపివేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. తమ ప్రమేయం లేకుండా భూములు సర్వేచేయడం తగదని వారు తెలిపారు. భూముల సర్వేపై శుక్రవారం పెదతీనార్లలో పలువురు రైతులు, నాయకులు విలేకరులతో మాట్లాడుతూ ఎందుకు తమ భూములను సర్వే చేస్తున్నారని ప్రశ్నించారు. రైతు సంఘ నాయకులు ఎం.అప్పలరాజు, శివాజీరాజు, కొర్లయ్య, అప్పలకొండరాజు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తోందన్నారు. భూసేకరణ చేయాలంటే ముందుగా రైతులకు నోటీసులు జారీ చేయాలని, వారి అనుమతితోనే భూములు సర్వే చేయాలన్నారు. తాజాగా జరుగుతున్న పరిణామాలు చట్టాలకు విరుద్ధంగా జరుగుతున్నాయన్నారు. కొద్దిరోజులుగా అధికారులు భూములను సర్వేచేస్తున్నారన్నారు. అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. ఎందుకోసం, ఎవరి కోసం భూములు సర్వే చేస్తున్నారని ప్రశ్నించారు.అధికారుల చర్యలు రైతుల హక్కులను కాలరాసేలా ఉన్నాయని చెప్పారు. భూముల సర్వేను వెంటనే నిలిపివేయాలని, లేకపోతే రైతులందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని చెప్పారు. భూములు ఎందుకు సర్వేచేస్తున్నారన్న విషయాన్ని గ్రామసభల ద్వారా రైతులకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎం.రాజేష్, బుజ్జి, బగాది రాజు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

మునగపాక: మండలంలోని చిన్నోడుపాలెం గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలు.. చిన్నోడుపాలెం గ్రామానికి చెందిన చిన్ని వరలక్ష్మి కుమార్తె ఈ నెల 20వ తేదీ అర్ధరాత్రి బహిర్భూమికి వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారుపడి వెతకడం ప్రారంభించారు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 21న మునగపాక పోలీసులకు వరలక్ష్మి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు.

క్లుప్తంగా

నేడు శూలాల మహోత్సవం

అనకాపల్లి: స్థానిక లక్ష్మీదేవిపేటలో గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి 9 గంటలకు శూలాల మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు బూడిద నాగేశ్వరరావు, ముప్పన రామలింగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆలయంలో శుక్రవారం శూలాల మహోత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, లక్ష్మీదేవిపేటలో రథం ఊరేగింపు, సాయంత్రం నేలవేషాలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేశెట్టి చిన వెంకట్రావు, వుప్పల శ్రీనువాసరావు, దేశెట్టి పవన్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ మోడల్ పరీక్ష రేపు

అనకాపల్లి: స్థానిక నెహ్రూచౌక్ జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదురుగా భాసర అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచిత నవోదయ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 95732 40152 నంబరులో సంప్రదించాలన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కశింకోట: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సీఐ అల్లు స్వామినాయుడు కోరారు. కశింకోటలో శుక్రవారం రాత్రి నిర్వహించిన పడమటమ్మ పుట్టుక ఉత్సవంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృక కార్యక్రమాల వేదికలపై స్క్రీన్ మీద మాదక ద్రవ్యాలకు బానిసలు కావడం వల్ల కలిగే అనర్థాలను వివరించే వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల యువత భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. దేశానికి ఉపయోగపడాల్సిన యువత చెడు మార్గాలు అనుసరించడం వల్ల దేశ ప్రయోజనాలకు నష్టం కలుగుతుందన్నారు.

తల్లిదండ్రుల చెంతకు అదృశ్యమైన విద్యార్థిని

అనకాపల్లి: అదృశ్యమైన స్థానిక గవరపాలెం దుర్గునాయుడు వీధికి చెందిన 10వ తరగతి విద్యార్థిని తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేరింది. ఆమె బుధవారం అదృశ్యమైనట్లు తండ్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. పట్టణంలో మరో ప్రాంతంలో ఉన్న విద్యార్థిని గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 3,110 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట
స్పెషల్ రకం	3,600	4,230
మొదటి రకం	3,420	3,730
రెండో రకం	3,210	3,660
మూడోరకం	3,000	3,200

అనకాపల్లి సినిమాలు

జీబ్రా	: రాజా
మందిర	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మెకానిక్ రాకీ	: షిర్డిసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
దేవకీనందన వాసుదేవ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 24 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 4 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(ఫోన్ నంబర్.9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 352 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

వ్యాధుల కాలం.. పశువులు భద్రం

- శీతాకాలంలో ముందస్తు జాగ్రత్తలు అవసరం
- పశుపోషణపై రైతులు దృష్టి సారిస్తే మేలు
- వైద్యుల సలహాలు మూగజీవాలకు ఉపయుక్తం



పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ ధర్మారావు

మండలంలో పశువుల వివరాలు	
ఆవులు	8,923
గేదెలు	14,320
గొర్రెలు	4,356
మేకలు	6,860

తుమ్మపాల: చలికాలంలో మనుషులకే కాదు మూగ జీవాలకు కూడా పలు రకాల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. పశు సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతైనా అవసరం. సకాలంలో తగిన వైద్యం అందిస్తే పశువులను కాపాడుకోవచ్చని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. సీజనల్ వ్యాధుల నుంచి పశు సంరక్షణకు సంబంధించి పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. పశు వ్యాధులు.. నివారణకు సంబంధించి టీకాలు, చికిత్సలపై వైద్యాధికారులు పలు సూచనలు చేస్తున్నారు.

జబ్బువాపు వ్యాధి

పశువుల్లో చలికాలంలో వచ్చే వ్యాధి జబ్బ వాపు. దీనిని సొప్ప వ్యాధి అని, బ్లాక్ క్వార్టర్ అని పిలుస్తారు. వ్యాధి ముఖ్యంగా తెల్లజాతి పశువులలో అనగా ఆవులలో ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల లోపు వయస్సులో వస్తుంది. ఈ వ్యాధి కారక సూక్ష్మజీవి క్లోస్ట్రిడియం షావై బీజాంశాలు మట్టి నుంచి పశువు శరీరంలోకి చేరినప్పుడు ఈ వ్యాధి సోకుతుంది. దీని నివారణకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు సరఫరా చేస్తుంది.

గురక లేదా గొంతువాపు

పశువుల్లో గురక లేదా గొంతు వాపు వ్యాధి బ్యాక్టీరియా సూక్ష్మజీవి కారణంగా వస్తుంది. గడ్డం కింద వాపు, కళ్లు ఎర్రపడటం, ముక్కు నుంచి జీర కారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతాయి. గొంతువాపు వ్యాధి నివారణకు సల్ఫాడిమిడిన్, ఇంటాసెఫ్‌టాజ్ అనే మందులు వాడటంతో ఫలితం ఉంటుంది. ముందస్తు టీకాలు వేయిస్తే అరికట్టవచ్చు.

గాలి కుంటువ్యాధి లక్షణాలు

పికార్నో వైరస్ వల్ల పశువుల్లో గాలికుంటు వ్యాధి సంక్రమిస్తుంది. గిట్టలు ఉన్న పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. నోరు, కాళ్లలో పుండ్లు ఏర్పడి పశువులు నడవలేకపోతాయి. ప్రత్యేకించి గాలికుంటు టీకాలు ఆరు నెలలకు ఓసారి వేయాలి.

|| సాధారణ చిట్కాలు ||

కాలానికి తగిన విధంగా ఆహారాన్ని, నీటిని అందిస్తూ పరిశుభ్ర వాతావరణంలో పశువులను ఉంచాలి. శీతాకాలం ప్రారంభం నుంచే అధిక చలి నుంచి రక్షణ ఏర్పాట్లు చేయాలి. శీతాకాలంలో పశువులకు దాణాను కాస్త ఆలస్యంగా ఇవ్వాలి. నట్టల నివారణ మందులు ముందస్తుగా తాగించాలి. ఎఫ్‌ఎండీ, హెచ్‌ఎస్, బీక్యూ టీకాలు తప్పని సరిగా వేయించాలి. పశువుల పాకలను సూర్యరశ్మి పడేవిధంగా ఏర్పాటు చేసుకోవాలి. ముఖ్యంగా పశుపోషణపై రైతులు దృష్టి సారించాలి.

వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. గిట్టల మధ్యలోని పుండ్లకు పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేయాలి. బీ స్ప్రెపెన్ అనే మందు 2.5 గ్రాములు, ఎన్రోఫ్లాక్సిన్ 50 ఎంఎల్ మందు వాడటంతో పాటు వేపనూనె రాయడంతో ఫలితం ఉంటుంది.

తిరుగుడు రోగం

రక్తంలోని ట్రిపనోజోమా పరాన్న జీవులు కారణంగా పశువుల్లో తిరుగుడు రోగం సంక్రమిస్తుంది. ఇది అన్ని రకాల పశువులకు వచ్చే అవకాశం ఉంది. బెరేనిల్, ట్రిక్విన్, పెరిటాస్ మందులు వాడటంతో ఫలితం ఉంటుంది.

మేకలు నీరసం పడుతున్నాయి..



120 మేకలను పెంచుతున్నా. చలి కాలంలో పసురు గడ్డి తినడం వల్ల కొన్ని మేకలకు గుండెకారం వ్యాపించి నీరసం పడుతున్నాయి. పశు వైద్యాధికారులు వచ్చి టీకాలు వేసి జాగ్రత్తలు చెప్పారు. మేతగా మంచు పడిన గడ్డిని పెట్టవద్దన్నారు. షెడ్డు లేకపోవడంతో మేకలను ఆరు బయట చలిలోనే ఉంచాల్సి వస్తుంది.

– యలమంచిలి దేముడు, గొలగాం గ్రామం

ముందస్తు చర్యలు అవసరం



పశువుల పెంపకంలో ముందస్తు చర్యలు చేపట్టడంతోనే సంరక్షణ సాధ్యమవుతుంది. వేసవి కాలం నుంచే పశువులకు టీకాలు వేయించాలి. డాక్టర్ల సలహాల మేరకే మందులు వాడాలి. ప్రతి పాడి రైతు క్షేత్రస్థాయిలో పశువుల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలి. గ్రామాల్లో అసిస్టెంట్ వెటర్నరీ సిబ్బంది ద్వారా ప్రతి పాడిరైతుకు జాగ్రత్తలు తెలియజేస్తున్నాం.

– డాక్టర్ అనిల్, పశువైద్యాధికారి, అనకాపల్లి మండలం

వంతెనలపై గోతులు పూడ్చాలి



కొత్త బ్రిడ్జిపై గోతుల వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం, ఆమ్ ఆద్మీ, బీఎస్పీ నాయకులు

అనకాపల్లి: స్థానిక శారదానది పాత, కొత్త వంతెనలపై గోతులు పూడ్చి ప్రమాదాలను నివారించాలని సీపీఐ జోనల్ కార్యదర్శి వై.ఎస్.భద్రం, ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు, బీఎస్పీ నేత సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. శుక్రవారం శారదానది కొత్త బ్రిడ్జిపై గోతుల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ భద్రం మాట్లాడుతూ రెండు వంతెనలపై పెద్ద పెద్ద గోతులు ఉండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు బ్రిడ్జిలపై గోతుల పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పరవాడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి లంకెలపాలెం-మంత్రిపాలెం మధ్య తుప్పల్లో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం కనుగొన్నారు. ఈ సమాచారాన్ని పరవాడ పోలీసులకు తెలిపారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు ఘటనాస్థలికి చేరుకుని, మృతదేహం ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. మృతుడికి 35–40 ఏళ్ల వయస్సు ఉంటుందని గుర్తించారు. మృతదేహం కుళ్లి పోయి దుర్వాసన వెదజల్లుతుండడంతో 15 రోజుల క్రితం మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడు సిమెంటు కలర్ హాఫ్ హ్యాండ్స్ కాలర్ టీ షర్ట్, గ్రే కలర్ ప్యాంటు, మూడు గిల్ట్ ఉంగరాలు ధరించాడు. మృతుడి వివరాలు తెలిస్తే పరవాడ పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు.

40 శాతం రాయితీపై గడ్డి కోసే యంత్రాలు



పాడిరైతులకు గడ్డి కోసే యంత్రాలు అందిస్తున్న అధికారులు

కశింకోట: పాడి రైతులకు గడ్డి కోసే యంత్రాలను 40 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరసింగబిల్లి పశు వైద్యాధికారి చైతన్యమణి కోరారు. మండలంలోని నూతలగుంటపాలెంలో శుక్రవారం ముగ్గురు పాడి రైతులకు గడ్డి కోసే యంత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్రాలతో గడ్డిని ముక్కలు చేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. అటువంటి గడ్డిని వృథా చేయకుండా పశువులు పూర్తిగా తింటాయన్నారు. పశుగ్రాసాల కాండం పెద్దగా, లావుగా, ఆకులు వెడల్పుగా ఉండటం వల్ల వాటిని పశువులు పూర్తిగా తినలేవన్నారు. లేత ఆకులను తిని కాండాన్ని విడిచి పెడతాయన్నారు. ఇటువంటి గ్రాసాన్ని చిన్న ముక్కలుగా చేసి అందిస్తే 90 శాతం వరకు మేస్తాయన్నారు. రుచి కూడా పెరుగుతుందన్నారు. గడ్డి కోసే యంత్రం ధర రూ.33,790 అని, ప్రభుత్వం ఇచ్చే రాయితీ 40 శాతం పోనూ రైతు రూ.20,282 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పశు వైద్య సహాయకుడు బి.రాజేష్, కూటమి నాయకులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరుల 198వ ఊంజల్ సేవ కార్యక్రమాన్ని శుక్రవారం మళ్ల అప్పలనాయుడు, ఇందిర దంపతులు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పాందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయి ఈ వేడుకను శాస్త్రోక్తంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, గౌరీ గీత మహిళా మండలి, గౌరీపరమేశ్వరి అమృత వర్షిని వ్యవస్థాపకురాలు పెతకంశెట్టి సుజాత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్ల నిర్మాణంపై ఫిర్యాదు



స్టోన్ క్రషర్లపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ పూడి పరదేశినాయుడు

తుమ్మపాల: మండలంలో మామిడిపాలెం రెవెన్యూ సర్వే నంబర్ 122, 126లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్లపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పూడి పరదేశినాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ విజయకుమార్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇటీవల పూర్తి చేసిన క్రషింగ్ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని కోరారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన



ఉత్తమ లేగ దూడలతో రైతులు, పశు వైద్యాధికారులు



లేగ దూడల ప్రదర్శన

కోటవురట్ల: పశువుల్లో లింగ నిర్ధారణ వీర్యంతో సత్ఫలితాలు వస్తున్నాయని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహక అధికారి డాక్టర్ బెహరా ప్రసాదరావు అన్నారు. బి.కె.పల్లిలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్థక శాఖల సౌజన్యంతో రాష్ట్రీయ గోకుల్ మిషన్ నిధులతో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ బెహరా ప్రసాదరావు మాట్లాడుతూ లింగ నిర్ధారణ వీర్యం 60 శాతం రాయితీపై అందిస్తున్నారని తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ పెట్ల నరేష్ మాట్లాడుతూ వ్యాధి కారక సూక్ష్మక్రిములలో వృద్ధి చెందుతున్న క్రిమి సంహారక ఔషధాల నిరోధకతపై ప్రతి పాడి రైతు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం లేగదూడలను పరిశీలించి ఉత్తమ దూడల రైతులకు ప్రోత్సాహకాలు అందించారు. ఈ శిబిరంలో ప్రదర్శించిన వివిధ జాతులకు సంబంధించి 42 లేగదూడలు ఆకట్టుకున్నాయి. 31 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. శిబిరంలో పాల్గొన్న ప్రతి రైతుకు మినరల్ మిక్చర్ దాణాను అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ ఆర్.ప్రతాప్, సర్పంచ్ లింగన్నాయుడు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ వన సమారాధన రేపు



సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గంటి రవికుమార్

అనకాపల్లి: అనకాపల్లి నియోజకవర్గ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కశింకోట మండలం జాతీయ రహదారి ప్రమీలా గార్డెన్‌లో వన సమారాధన నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు గంటి రవికుమార్, గౌరవాధ్యక్షుడు కె.వి.గౌరీపతి తెలిపారు. స్థానిక జర్నలిస్ట్ క్లబ్ ఆవరణలో శుక్రవారం జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. వనసమారాధన కార్యక్రమంలో ఉదయం సూర్యనమస్కారాలు, శివుడికి రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. పేద విద్యార్థులకు ధన సహాయం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు ఆధార్, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ తప్పనిసరి

అనకాపల్లి: సంక్షేమ పథకాలకు ఆధార్, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ తప్పనిసరని అనకాపల్లి డివిజన్ తపాల శాఖ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ చెప్పారు. కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌లో ఆధార్ అనుసంధానం లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందడం లేదన్నారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో 2.6 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా.. నేటి వరకూ 25,000 మంది తపాలశాఖలో ఎన్‌పీసీఐలో నమోదు చేసుకున్నారని చెప్పారు. మ్యాపింగ్ ద్వారా ఆధార్ సీడింగ్ చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు ప్రతి సచివాలయం పరిధిలో తపాల శాఖ ద్వారా ఐపీపీబీ అకౌంట్స్‌ను ఓపెన్ చేయటం, ఆధార్ అనుసంధానం వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.

ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో



విజేతలతో డీఈవో గిడ్డి అప్పారావు, సిబ్బంది

సబ్బవరం: మండలంలోని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అనకాపల్లి జిల్లావిద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రార్థన సమయానికి ముందే పాఠశాలకు వచ్చి అసెంబ్లీ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాల పనివేళలు సాయంత్రం 5 గంటల వరకూ పెంచడంపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో ఉన్న సమస్యలను ఆరా తీశారు. వంట గది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. వివిధ క్రీడా పోటీలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు తరగతి పాఠ్యాంశాలతో పాటు రోజుకో నీతి కథను చెప్పించాలని సూచించారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడ్డ వారి వివరాలను విద్యార్థులకు తెలిపి, వారిలో స్ఫూర్తిని నింపాలని ఉపాధ్యాయులను కోరారు. ఆయన వెంట పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.రాధాకుమారితోపాటు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పశు వైద్యశాలలో చోరీ నిందితుడిపై కేసు

అనకాపల్లి: స్థానిక విజయరామరాజుపేట సమీపంలో జిల్లా పశువైద్యశాలలో 55 గ్రాస్ కటింగ్ బ్లేడ్స్‌ను చోరీ చేసిన ఏఎంసీ కాలనీకి చెందిన కోరుపోలు దుర్గసన్నిబాబును పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన నుంచి 44 గ్రాస్ కట్టింగ్ బ్లేడ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ శుక్రవారం తెలిపారు. పశు వైద్యశాఖ అధికారి శుక్రవారం పట్టణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. అదే ప్రాంతానికి చెందిన దుర్గసన్నిబాబుగా గుర్తించినట్లు సీఐ తెలిపారు.

ఘనంగా అంబలం పూజ

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో ఎన్టీఆర్ క్రీడా మైదానం వాకర్స్ గౌరవాధ్యక్షుడు కోటిపల్లి కిషోర్ కుమార్ స్వగృహం వద్ద గురువారం రాత్రి భారీ అంబలం పూజ నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్పస్వాములు భారీ ఎత్తున హాజరై స్వామి పాటలు పాడారు. వినాయక, అయ్యప్ప స్వామి, సుబ్రహ్మణ్యం స్వామి మండపాన్ని అరటిడొప్పలతో నిర్మించి ప్రత్యేక పూజలు చేపట్టారు. రాత్రి 11 గంటకు పడిపూజ చేసి, పూజలో పాల్గొన్న 600 మంది స్వాములకు ప్రసాదం పంపిణీ చేశారు.



అంబలం పూజ నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

గుడివాడ గురునాథరావుకు ఘన నివాళి



కశింకోటలో మాజీ మంత్రి గురునాథరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కశింకోట: దివంగత మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు వర్ధంతి కార్యక్రమం శుక్రవారం కశింకోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న గురునాథరావు విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండల సచివాలయ సమన్వయకర్త కలగా గున్నయ్యనాయుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, పార్టీ నాయకులు నీటిపల్లి దివాకర్, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. గురునాథరావు చేసిన సేవలను స్మరించుకున్నారు.

సంతోషిమాత ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు



ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ ఈవో టి.రాజసులోచన, ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: వచ్చే నెలలో మొదటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని గవరపాలెం సంతోషి మాత అమ్మవారి ఆలయ 45వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో టి.రాజసులోచన, దేవస్థానం చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు తెలిపారు. స్థానిక ఆలయంలో శుక్రవారం వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వార్షికోత్సవం భాగంలో అమ్మవారికి 24 గంటల జైసంతోషిమాత ఏకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేసి, మధ్యాహ్నం 5 వేల మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ముద్ద ఈశ్వరరావు, పొలిమేర సన్యాసినాయుడు, ఆళ్ల రవికుమార్, కర్రి మణి, ఆలయ అర్చకుడు కామేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన



వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సప్తమి శుక్రవారం పురస్కరించుకుని శివలింగానికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, కాశీఅన్నపూర్ణపూర్ణదేవికి సహస్ర కుంకుమార్చన, రుద్ర హోమాలు ఆలయ అర్చకులు బాబు, శేషు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి 9 గంటలకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల పని వేళలు మార్చొద్దు



సమావేశంలోమాట్లాడుతున్న ధర్మారావు

నక్కపల్లి: పాఠశాలల పనివేళలు మార్చడానికి వీల్లేదని, ప్రస్తుతం ఉన్న పని వేళలనే కొనసాగించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ ధర్మారావు డిమాండ్ చేశారు. శుక్రవారం నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పని వేళల విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. జీవో నంబర్ 117ను రద్దు చేయాలన్నారు. తక్షణమే ఐఆర్ ప్రకటించాలన్నారు. పీఆర్‌సీ కమిషన్ నియమించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక అంశాలతో కూడిన పెండింగ్ బిల్లులను తక్షణమే మంజూరు చేయాలన్నారు. త్వరలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న పాకలపాటి పాకలపాటి రఘువర్మకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ డి.కొండలరావు, మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ, గౌరవాధ్యక్షుడు ఫాల్గుణరావు, ఉపాధ్యక్షుడు నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.